# అప్రమత్తతే శ్రీరామరక్ష

- వడదెబ్బపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు
- మండల వైద్యాధికారి స్వాతి లక్ష్మి



**బుక్కరాయసముద్రం:** ఎండల తీవ్రత అధికమైంది. ప్రస్తుతం జిల్లాలో 40–42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్, (శరీరంలో నీటి శాతం తగ్గడం) డయేరియా (విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశముంది. ఈనేపథ్యంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వైద్యాధికారి స్వాతి లక్ష్మి సాక్షికి వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

**ఎండలో పని చేస్తే...**

ప్రజలు వేసవిలో వీలైనంతగా పని చేయకుండా ఉండడం మంచిది. ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బకు గురైన బాధితులను చల్లని ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడిగుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించాలి.



పట్టణ ఆరోగ్య కేంద్రం

## వేసవిలో చేయకూడని పనులు

- ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- మద్యం సేవించరాదు.
- రోడ్లు మీద చల్లని రంగు పానీయాలు తాగరాదు.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినరాదు
- వేసవిలో మాంసాహారం తగ్గించాలి
- నూనెలో వేయించిన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు.

## వేసవిలో చేయాల్సిన పనులు

- నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీటితోపాటు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి
- పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి
- రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి
- భోజనం మితంగా చేయాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- ఆరుబయట పడుకున్నప్పుడు దోమతెరలు వాడాలి
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి
- తాజా కాయగూరలు, ఎక్కువగా తీసుకోవాలి
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి

## వడదెబ్బకు ప్రథమ చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి.
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి లేని పక్షంలో గ్లూకోజు ద్రావణం తాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.
- వడదెబ్బ తగిలితే వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి

## క్లుప్తంగా

### నెట్టికంటుడికి రూ.లక్ష విరాళం


దాతలకు తీర్థప్రసాదాలతోపాటు రసీదును అందజేస్తున్న ఆలయ సిబ్బంది

**గుంతకల్లు రూరల్:** నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన పరుచూరి నాగ రవితేజ, అతడి కుటుంబ సభ్యులు ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ అన్నదాన సత్రం నిర్వహణ కోసం మొత్తాన్ని అందజేసినట్లు దాతలు తెలిపారు. ఈసందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు.

### 31లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

**తాడిపత్రి టౌన్:** స్థానిక ట్రెజరీ కార్యాలయం పరిధిలోని ప్రభుత్వ పెన్షనర్స్ ఈనెల 31వ తేదీలోపు ఈ– కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తాడిపత్రి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ– కేవైసీ చేయించుకోవడానికి ట్రెజరీ కార్యాలయానికి వచ్చే పెన్షనర్స్ సెల్, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

### సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

**గార్లదిన్నె:** కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

### ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**పుట్లూరు:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియెట్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆస్మా సయెదా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో చేరే విద్యార్థులు జూన్ 7లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**గార్లదిన్నె:** స్థానిక మోడల్ స్కూల్లో 2023–24కు గాను జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో సోమవారం నుంచి జూన్ 6 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులన్నాయని, మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### పామిడమ్మకు ప్రత్యేక పూజలు


పామిడమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**పామిడి:** పామిడమ్మ ఆలయంలో ఆదివారం ఉత్సవ విగ్రహ చర ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దుస్తకర్ పవన్, రవి సౌజన్యంతో రూ.లక్ష వ్యయంతో తయారు చేయించిన ఈ ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో అందజేశారు. ఈసందర్భంగా వేదపండితులు కలశస్థాపన, గణపతి పూజ, నవగ్రహ, వాస్తు, దుర్గహోమాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాటిల్ శ్రీనాథ్‌రెడ్డి, కవి నారాయణమూర్తి, నాగూరు పాపిరెడ్డి, బొల్లు వెంకట్రామిరెడ్డి, మస్తానయ్య, రంగనాయకులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

### సంతల ద్వారా రూ.3.43 లక్షల ఆదాయం


సంతకు వచ్చిన ఎద్దులు

**అనంతపురం అగ్రికల్చర్:** స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.43 లక్షలకు పైచిలుకు ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్, ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,01,570 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,42,390 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

## ప్రశాంతంగా జీవించండి

**పెద్దవడుగూరు :** గ్రామాల్లో ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని దిమ్మగుడి, చిత్రచేడు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య తలెత్తినా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. చిన్నపాటి విషయాలకే గొడవలకు దిగి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా నూతన వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

**బుక్కరాయసముద్రం:** పండ్లతోటల సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఏపీఓ శ్రీదేవి తెలిపారు. 2023–24కి గాను ఉపాధి హామీ కింద మామిడి, సపోట, జామ, నిమ్మ, దానిమ్మ, నేరేడు, సీతాఫలం, అంజూర, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకం కల్పిస్తోందని పేర్కొన్నారు. జాబ్ కార్డుకు 5 ఎకరాల లోపు పొలం ఉండాలని, ఉద్యాన తోటల నిర్వహణ కోసం ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందని తెలిపారు. వివరాలకు ఉపాధి సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**యాడికి:** ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని కుంటలో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.3,870 నగదు స్వాధీనం చేసుకున్నారు.

## ఆటో బోల్తా.. ఐదుగురికి తీవ్ర గాయాలు

**యాడికి:** మండలంలోని కోనుప్పలపాడు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మండల కేంద్రంలో కోన రోడ్డులో ఉన్న కంబగిరి తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి రెండు ఆటోల్లో శనివారం సాయంత్రం ప్యాపిలి మండలంలోని కంబగిరిస్వామి దేవస్థానానికి వెళ్లారు. దర్శనానంతరం ఆదివారం సాయంత్రం తిరుగుపయనమయ్యారు. కోన రామలింగేశ్వర దేవస్థానం సమీపంలో మలుపుల వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడింది. ఆటోల్లో ఉన్న కంబగిరి, కమల, కళాంజలి, భువన, నారాయణమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు 108లో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.


తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు


సమావేశమైన పూర్వ విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

**యాడికి:** బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా, అనంతపురం, కర్నూలు.. ఇలా వేర్వేరు చోట్ల ఉన్న చిన్ననాటి స్నేహితులు 32 ఏళ్ల తర్వాత కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సంతోషంలో మునిగిపోయారు. రాయలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1991–92 బ్యాచ్‌కు 10వ తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 85 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భగా అప్పటి గురువులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, నారపరాజు, గెల్లపురెడ్డి, నాగరాజు శర్మ, రవికుమార్, ఓబులేసు, పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎం డేనియల్‌ను పూలమాలలు, బొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ప్రసాద్, ప్రశాంత్ వర్ధన్, రంగస్వామి, నారాయణరెడ్డి, మదమంచి శివ, శ్రీనివాసులు, సతీష్, మురళీమోహన్‌గౌడ్, రాజా పుల్లయ్య, రామచంద్రారెడ్డి, మనోహర్ నాయుడు, నన్నేభా, గిరిబాబు, లక్ష్మీనారాయణ అనూరాధ, రామచెన్నమ్మ, హుసేనమ్మ, దేవి, పుష్పావతి పాల్గొన్నారు.

## జనసేన నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేయండి

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పరుష పదజాలంతో దూషించిన జనసేన పార్టీ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వైఎస్ఆర్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బిందెల శ్రీదేవి కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిని కలిసి జనసేన పార్టీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17న జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాయవాది కుంటిమద్ది జయరామిరెడ్డి, మరో ఇద్దరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వారు చేసిన వ్యాఖ్యలతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. బాధ్యతాయుతమైన న్యాయవాద వృత్తిలో ఉండి కూడా ఇలా మాట్లాడడం సరికాదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


జనసేన నేతలపై డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


అనుగ్రహభాషణం చేస్తున్న వ్యాసరాజమఠం పీఠాధిపతులు

**అనంతపురం కల్చరల్:** భక్తిమార్గంతో ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని వ్యాసరాజ మఠం పీఠాధిపతులు శ్రీవిద్యశ్రీస స్వామీజీ ఉద్బోధించారు. ఆదివారం విశ్వ మధ్వ మహాపరిషత్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వటువులకు సామూహిక ధర్మోపనయనాలు శాస్త్రోక్తంగా సాగినాయి. స్థానిక పాతూరులోని ఉత్తరాధిమఠం ప్రాంగణంలోని మూలాంజనేయస్వామి ఆలయంలో ఎనిమిది మంది వటువులకు ఉచిత ఉపనయనాలు జరిపించారు. విశిష్ట అతిథులుగా కర్ణాటక రాష్ట్రం సోసలే నుంచి విచ్చేసిన వ్యాసరాజమఠం పీఠాధిపతులు శ్రీవిద్యాశ్రీస స్వామీజీ వటువులను ఆశీర్వదించి, అనుగ్రహభాషణం చేశారు. అంతకు ముందు మూలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ పాతూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ వినోదాచార్, సీనియర్ న్యాయవాది ఏఎస్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాలసర్పదోష నివారణ పూజలు

**ఆత్మకూరు :** పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృతాభిషేకాలు, కుజ దోష, కాల సర్పదోష నివారణకు ప్రత్యేక పూజలు, రాహుకేతు హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామికి సుబ్రహ్మణేయశ్వర మూలమంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. అనంతరం ఆకుపూజ, పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరుడు

## నేటి కార్యక్రమాలు

### 'గడప గడపకూ మన ప్రభుత్వం'

**పుట్లూరు:** సి.వెంగన్నపల్లి పంచాయతీ పరిధిలోని సి.వెంగన్నపల్లి, నారాయణపల్లి, గోపురాజుపల్లి గ్రామాల్లో సోమవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

### వలంటీర్లకు పురస్కారాలు

**శింగనమల:** స్థానిక వాసవీకల్యాణ మండపంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మండలంలోని వలంటీర్లకు సేవా పురస్కారాలు అందించున్నట్లు ఎంపీడీఓ నిర్మలా కుమారి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. మండలంలోని వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

### ప్రజా సంక్షేమ యాత్ర

**తాడిపత్రి టౌన్:** తాడిపత్రి మండలం వీరాపురం ,హుస్సేనాపురం, బొందలదిన్నె, వంగనూరు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజా సంక్షేమ యాత్ర చేపట్టనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

### 'స్పందన'కు హాజరుకండి

**యల్లనూరు:** తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

### టెన్త్ విద్యార్థులకు సన్మానం

**బుక్కరాయసముద్రం:** స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్నట్లు జెడ్పీటీసీ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 500 మార్కులు పైన సాధించిన అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చేతులు మీదుగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

## 'జగనన్న ఆణిముత్యాలు'కు విద్యార్థుల ఎంపిక

**యల్లనూరు:** శింగనమల నియోజకవర్గంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆదివారం ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ లోకేశ్వరి (ఆదర్శపాఠశాల) 584మార్కులు రూ.15 వేలు మొదటి బహుమతి, స్పందన (తిమ్మంపల్లి హైస్కూల్) 583 మార్కులు, రెండో బహుమతి రూ.10 వేలు, తనూష (తిమ్మంపల్లి హైస్కూల్) 581మార్కులు, మూడో బహుమతి కింద రూ.5 వేలు నగదును ఈనెల 25న శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చేతుల మీదుగా ప్రదానం చేస్తారన్నారు.

## వైభవంగా ఉజ్జినప్ప,రాకెట్లప్పస్వామి పట్టమ దేవర

**ఉరవకొండ:** పట్టణంలో ఉజ్జినప్ప, రాకెట్లప్ప స్వాముల పట్టమ దేవర కార్యక్రమాన్ని ఆదివారం వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉజ్జినప్ప, రాకెట్లప్ప ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక గవిమఠం ప్రాంగణం నుంచి పట్టణంలో ఊరేగించారు. పాతపేటలోని రాకెట్లప్ప, ఉజ్జినప్ప ఆలయం వద్దకు చేరుకుని స్వాముల మహా పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలమూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## రెండు కార్ల ఢీ.. ఆరుగురికి గాయాలు

**డి హీరేహాళ్(రాయదుర్గం):** బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారిలోని డి హీరేహాళ్ మండల కేంద్రం పోలీస్‌స్టేషన్ సమీపాన ఆదివారం వేకువజామున రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ కారు నుజ్జయింది. వివరాలు.. బెంగళూరు నుంచి బళ్లారి వైపు ఓ కారు వెళ్తుండగా, వెనుక నుంచి మరో కారు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో ముందు కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడగా, వెనుక కార్లో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు.

## ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం


గుత్తిలో కొవ్వొత్తులతో సంఘీభావం తెలుపుతున్న దృశ్యం


గుంతకల్లులో కొవ్వొత్తులు వెలిగిస్తున్న దృశ్యం

**గుంతకల్లుటౌన్:** నిశ్శబ్దాన్ని ఛేదించడం ద్వారా ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సూచనల మేరకు ప్రగతి మైత్రీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్‌తో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. విచ్చలవిడి శృంగారంతో పాటు రక్తదానం చేసేటప్పుడు, సూదిమందులను వినియోగిస్తున్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ వ్యాధి విజృంభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ నూర్జహాన్, మేనేజర్ రమేష్, సిబ్బంది నజుమునిసా, లక్ష్మీదేవి, లక్ష్మిపతి, భూలక్ష్మి, సరస్వతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే**

**గుత్తి:** పట్టణ శివారులోని హ్యాండ్స్ కార్యాలయంలో ఆదివారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం సూచనల మేరకు హ్యాండ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో జీవిస్తున్న, మరణించిన వారందరికీ సంఘీభావంగా కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హ్యాండ్స్ పీడీ నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

**తాడిపత్రి టౌన్:** స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం రాత్రి మాస్ ఎడ్యుకేషన్ అండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో మృతి చెందిన రోగులకు సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలియజేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ మేనేజర్ జగన్నాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మెగా కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**పామిడి:** స్థానిక షాదీఖానాలో మంగళవారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆయూష్ జిల్లా సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో బెంగళూరు శంకర ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కంటి వైద్య నిపుణురాలు స్వప్న 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 85 మందిని కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ టీ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి పీసీ జయరామ్, కవి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో కిరణ్ గౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కృష్ణకాంత్‌రెడ్డి, గైనిక్ వైద్యనిపుణులు సింధూ తదితరులు 500 మందికి ఉచిత పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. రోగులకు భోజన వసతి కల్పించారు. ట్రస్ట్ అధినేత కిరణ్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ బాలుర ఆశ్రమ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**తాడిపత్రి టౌన్:** తల్లిదండ్రులు లేదా తల్లి లేక తండ్రి లేని అనాథ బాలుర ఆశ్రమ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తాడిపత్రి బాల కల్యాణ ఆశ్రమ గౌరవాధ్యక్షుడు చిన్నూరావు, అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి లక్ష్మీనరసింహ ఓ ప్రకటనలో కోరారు. ఐదేళ్లు నిండిన బాలురు మాత్రమే అర్హులని, ఆశ్రమంలో ఆశ్రయం, వ్యాయామం, నైతిక విలువలతో కూడిన విద్య బోధించనున్నట్లు పేర్కొన్నారు. సౌభాగ్యసింధూ ట్రస్ట్ పేరుతో దాతల సహాయ సహకారాలతో ఆశ్రమ నిర్వాహణ జరుగుతున్నట్లు తెలిపారు. పప్పూరు రోడ్డులోని మోడల్ స్కూలు సమీపంలో అనాథ బాలుర ఆశ్రమ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9908746900, 8919278039 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## బీరు సీసాతో దాడి



గాయపడిన రమేష్, సాయి

**పామిడి:** చిల్లాకట్టి ఆటలో వరుసగా విజయాలు సాధిస్తుండడంతో ప్రత్యర్థి జట్టు క్రీడాకారుడు ఓర్వలేకపోయాడు. విజేతలపై బీరు సీసాతో దాడి చేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని ఎస్సీ హాస్టల్ వీధికి చెందిన బోయ రమేష్, సాయి ఓ జట్టుగా, సంత మార్కెట్‌కు వీధికి చెందిన మాల ధను మరో జట్టుగా తరచూ చిల్లా కట్టి ఆడేవారు. ఈ క్రమంలో ప్రతిసారి రమేష్ జట్టు గెలుపొందుతుండడాన్ని ధను ఓర్వలేకపోయాడు. ఆదివారం భోగేశ్వరాలయం సమీపంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బీరు సీసాతో రమేష్, సాయిపై ధను దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రమేష్‌చ సాయి స్థానికప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.